క్లుప్తంగా

ఆ గ్రామాలకు ల్యాండ్ కన్వర్షన్ అనుమతి లేదు

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో అవుటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనలు అమలులో ఉన్న నేపథ్యంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా ల్యాండ్ కన్వర్షన్ చేసుకునేందుకు అనుమతి లేదని తహసీల్దారు విమలాకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెద్దఅవుటపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు, తేలప్రోలు, వేంపాడు, తరిగొప్పుల, వెల్దిపాడు, వెన్నుతల, మానికొండ గ్రామాలు ఈ జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు గుర్తించాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి బీసీ కాలనీలో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం చేపట్టారు. తొలుత రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న బీసీ కాలనీలోని ప్రధాన రహదారిని ఐదు మీటర్ల వెడల్పు, 200 మీటర్ల పొడవునా సీసీ రోడ్డుగా నిర్మాణం చేసినట్లుగా వివరించారు. మరో రూ. 1.20 కోట్లు గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లుగా తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు శాంతి కిషోర్, మాజీ ఎంపీటీసీ మరీదు రాంబాబు, వార్డు సభ్యులు రత్తయ్య, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం పీఎస్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శనివారం గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు విచ్చేశారు. గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసుకు సంబంధించి కోర్టు బెయిల్ షరతుల మేరకు ఆయన పీఎస్‌లో సంతకం చేశారు. అనంతరం బయటకు వచ్చిన ఆయనను నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారందరిని వంశీమోహన్ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఉన్నారు.

22న విద్యుత్ అదాలత్

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి ఈనెల 22వ తేదీన ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు ఏపీసీపీడీసీఎల్ హనుమాన్‌జంక్షన్ ఏడీఈ బి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని రాయలహంపి కల్యాణ మండపంలో అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూరగాయల ప్రసాదం పంపిణీ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం భక్తులకు కూరగాయలు, పండ్లు ప్రసాదం పంపిణీ చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లను ఈనెల 18న రకరకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. దాతల సహకారంతో అలంకరించిన ఈ కూరగాయలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ అమ్మవారి అలంకరణకు భక్తులు విశేషంగా సహకరించారన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినుముకు దక్కని మద్దతు

- క్వింటా మినుము మద్దతు ధర రూ.7,400
- రూ.6,600 చొప్పునే కొంటున్న వ్యాపారులు
- రైతుల వద్ద పేరుకుపోయిన మినుము నిల్వలు



కంకిపాడులోని ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన మినుము బస్తాలు

కంకిపాడు: పునాదిపాడు గ్రామానికి చెందిన రైతు సాయిబాబు ఐదెకరాల్లో మినుము సాగు చేశాడు. ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. గతేడాది క్వింటా మినుము ప్రభుత్వ మద్దతు ధర రూ.7,400. మార్కెట్‌లో క్వింటా ధర రూ.9,100కు పైగా పలికింది. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా మంచి ధర లభిస్తుందని ఆశించాడు. రోజురోజుకూ ధర పడిపోతుండటం ఆందోళన చెందుతున్నాడు. పండిన పంటను ఇంట్లో నిల్వ చేసుకోలేక, వచ్చిన ధరకు తెగనమ్మలేక సతమతమవుతున్నాడు. ఇది ఈ ఒక్క రైతు ఇబ్బందే కాదు. జిల్లా వ్యాప్తంగా గత రబీలో మినుము సాగు చేసిన రైతులు అందరి పరిస్థితి. ధర ఆశాజనకంగా ఉంటుందని ఆశించి పంట నిల్వ చేసిన రైతులు నేడు నానాటికీ పడిపోతున్న మినుము ధరలను చూసి నిరాశ చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులు మార్కెట్‌ను నియంత్రించి అడ్డగోలుగా ధర నిర్ణయం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల వద్ద ఉన్న పంటను కొనుగోలు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

దిగుబడులు భళా

జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో గత రబీ సీజన్‌లో 2,84,237 ఎకరాల్లో మినుము సాగయింది. ఎల్‌బీజీ, ఎల్‌జీజీ, తిరుపతి, ఇతర స్థానిక రకాలను రైతులు సాగు చేశారు. పెసర మరో మూడు వేల హెక్టార్లలో సాగయింది. అక్కడక్కడా పల్లాకు తెగులు, బంగారు తీగ, మచ్చల పురుగు ఆశించినా.. ఆశించిన దిగుబడులు లభించాయి. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు రైతులకు సాగు ఖర్చులవగా, ఏడు నుంచి తొమ్మిది క్వింటాళ్ల వరకూ దిగుబడులు వచ్చాయి.

పతనమవుతున్న ధర

గత రబీ సీజన్‌లో జిల్లాలో 12 ప్రాంతాల్లో పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 519 మంది రైతుల నుంచి 1,128.45 టన్నులు పెసరను కొనుగోలు చేసి రైతులకు రూ.9.79 కోట్లు చెల్లించారు. మినుము మద్దతు ధర రూ.7,400 ఉండగా, మార్కెట్‌లోనూ రూ.7,400 నుంచి రూ.7,600 వరకు ధర పలకడంతో మినుముల కోసం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలనే డిమాండ్ రైతుల నుంచి రాలేదు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.9,100కు పైగా మార్కెట్‌లో ధర లభించింది. అదే తరహాలో ధర పెరుగుతుందనే ఆశాభావంతో చాలా మంది రైతులు ఇళ్ల వద్దే మినుమును నిల్వ చేసుకున్నారు. ఊహించని విధంగా ధర నేల చూపులు చూస్తోంది. క్వింటా ధర రూ.6,500 నుంచి రూ.6,600 చొప్పునే పలుకుతోంది. దిగజారుతున్న ధరను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల గోడు పట్టని కూటమి సర్కారు

రోజు రోజుకూ మినుము ధర పతనమవుతున్నా కూటమి సర్కారు స్పందించడం లేదు. కనీస మద్దతు ధర కూడా దక్కక, పంటను అమ్ముకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నా రైతులపై కనికరం చూపడం లేదు. మార్కెట్‌లో దళారులు ఇష్టారాజ్యంగా ధర నిర్ణయం చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం కళ్లుతెరిచి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల స్థాయిలో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెస్తే తప్ప మద్దతు ధర దక్కదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు.

నష్టపోతున్నా పట్టించుకోరా?

మినుము ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. రైతులు ఆర్థికంగా నష్టపోతున్న పరిస్థితి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే ఆదుకోవాలి. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవాలి. నేరుగా రైతుల నుంచి మినుము పంట కొనుగోలు చేస్తే బయటి మార్కెట్‌లో కూడా మంచి ధర దక్కుతుంది. రైతులు దోపిడీకి గురికాకుండా ఉంటారు.

– మాగంటి శ్రీనివాసరావు, రైతు విభాగం అధ్యక్షుడు, పెనమలూరు నియోజకవర్గం

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ప్రస్తుత మార్కెట్ ఒడిదుడుకులపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. రైతుల వద్ద పంట ఉందనే సమాచారాన్ని నివేదించాం. ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా రాలేదు. మార్గదర్శకాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుని రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పెసర కొనుగోలుకు సంబంధించి ఒక్క రూపాయి కూడా పెండింగ్ లేకుండా చెల్లింపులు జరిగాయి. మినుము రైతుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– మురళీకిషోర్, డీఎం, మార్క్‌ఫెడ్, కృష్ణాజిల్లా

మెరక పనులకు శ్రీకారం



గోసాల సెంటరులో రోడ్డును తవ్వుతున్న పొక్లెయినర్

సాక్షి ఎఫెక్ట్

కంకిపాడు: ఎట్టకేలకు ఎన్‌హెచ్ అధికారుల్లో కదలిక వచ్చింది. రోడ్డు సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలకు ఉపక్రమించారు. ఈనెల 1న 'అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం' శీర్షికన సాక్షిలో గోసాల సెంటరులో నెలకొన్న రహదారి మురుగు సమస్యపై కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జాతీయ రహదారుల శాఖ అధికారులు గోసాల సెంటరులో పల్లంగా ఉన్న ప్రదేశంలో మురుగు చేరే ప్రాంతాన్ని పూర్తిగా పెకలించి కంకరు మిక్స్‌తో నింపి చదును చేశారు. దీంతో తాత్కాలికంగా మురుగు నిలిచి ప్రజలు పడే ఇక్కట్లకు తెరపడినట్లయ్యింది.

గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మక్క

గన్నవరం: మధ్యాహ్న భోజన పథకం అవసరాలకు ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లను ఉచితంగా సరఫరా చేయాలని వంట ఏజెన్సీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గండికోట సమ్మక్క డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం వంట ఏజెన్సీ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు వంట ఏజెన్సీలకు పెనుభారంగా మారిందన్నారు. ఈ పథకం కింద పనిచేసే కార్మికులకు ఐడీ కార్డులు, యూనిఫాం పంపిణీతో పాటు బీమా సదుపాయాన్ని కల్పించాలని కోరారు. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన మండల సంఘం కార్యవర్గ ఎన్నికల్లో నూతన అధ్యక్షురాలుగా జీ. సుందరమ్మ, ఉపాధ్యక్షురాలుగా లలితకుమారి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు బీమా పరిహారం ఇవ్వాలి

పెనమలూరు: చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం బీమా పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన శనివారం పోరంకిలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణాజిల్లా నాగాయలంక, జింకలపాలెం, గుల్లలమోద, సంగమేశ్వరం గ్రామాలకు చెందిన ఐదుగురు మత్స్యకారులు చేపలవేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందారన్నారు. వీరు మరణించి ఏడాది కావొస్తున్నా వారి కుటుంబాలకు బీమా పరిహారం అందలేదన్నారు. మత్స్యకారుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగాయలంకకు చెందిన మేడా కృపారావు అనే మత్స్యకారుడు గత 8 నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందగా బీమా అందలేదన్నారు. మృతుడి కుమారుడు బీటెక్ చదువుతున్నాడని ఫీజుకు సొమ్ము లేక చదువు మాని కూలీ పనులకు వెళుతున్నాడని అన్నారు. మృతుల కుటుంబాలు వీధిన పడక ముందే ప్రభుత్వం మృతిచెందిన మత్స్యకారుల కుటుంబాలకు బీమా సొమ్ము వెంటనే ఇవ్వాలని కోరారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



కంకిపాడు: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎంసీహెచ్ ఖాశిం డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మట్లాడారు. ఈ ఏడాది జూన్ నుంచి రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ బాధ్యతలు డీలర్లకు అప్పగించారని తెలిపారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా ఇళ్లకు వెళ్లి రేషన్ అందిస్తున్నామన్నారు. పదేళ్లుగా రేషన్ డీలర్ల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2018 నుంచి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన జీఓలు అమలు కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణపై ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ రాఘవయ్యపార్కు వద్ద గల మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి రేషన్ డీలర్లు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి హేయం



జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అధికార మదంతో టీడీపీ, జనసేన గూండాలు బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై దాడి చేయడం అత్యంత హేయనీయమని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము దంపతులపై ఇటీవల గుడివాడలో దాడి జరిగిన నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు శనివారం వారిని పరామర్శించారు. పెడన మండలం కుదూరులోని వారి స్వగృహంలో జెడ్పీ చైర్మన్ హారిక, రాములను కలిశారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాపులపాడు మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, బీసీ సెల్ నాయకుడు చెన్నుబోయిన శివయ్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, యువజన విభాగం నాయకుడు మద్దాల కిన్ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

డ్రెయిన్‌పై ట్రాన్స్‌ఫార్మర్ వద్దని వినతి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న నున్న వాసులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నున్న గ్రామంలో చెరువు సెంటర్ నుంచి లైబ్రరీకి వెళ్లే ప్రధాన రహదారిలోని డ్రెయిన్‌పై అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నిలుపుదల చేయాలని స్థానికులు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు విన్నవించారు. ఈ మేరకు ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సంబంధిత పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను తొలగించేందుకు అధికారులు ప్రయత్నించగా ఎమ్మెల్యే పేరు చెప్పి పనులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సామర్థ్యాన్ని పెంచడానికి బదులు కొత్తగా మరొకటి వేస్తున్నారని అది పటమట బజార్ రోడ్డులో రాకపోకలు సాగించేవారికి ప్రమాదకరంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణంతో డ్రెయిన్‌లో సిల్టు తీయడానికి కూడా ఆటంకంగా మారుతుందని వివరించారు. దీంతో ఎమ్మెల్యే వెంకట్రావు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

వేలం పాట వాయిదా

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల విక్రయ దుకాణం వేలం పాటను శనివారం నిలిపివేశారు. అనివార్య కారణాలతో దుకాణాల వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా ఈ వేలం పాట వ్యవహారంలో టీడీపీ, జనసేన నేతల మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడటంతో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాయిదా వేసినట్లుగా సమాచారం.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ శేషుకుమార్



మొక్క నాటుతున్న డీసీహెచ్ఎస్ శేషుకుమార్



స్టెయిన్లెస్ స్టీల్ బాటిల్స్ పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ తదితరులు



సూరంపల్లిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఉయ్యూరు రూరల్: ప్రజా ఆరోగ్యానికి అడ్డుగా నిలుస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల కోఆర్డినేటర్ శేషుకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో స్వచ్ఛాంద - స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. ముందుగా ఆసుపత్రి ఆవరణలో సిబ్బంది రోటరీ క్లబ్ వాకర్ అసోసియేషన్, శ్రీనివాస విద్యా సంస్థల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు విధిగా నాటాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, వాకర్స్ అసోసియేషన్ డాక్టర్ సంఘం తిరుమలరావు, కోడే సాంబశివరావు, నెల్లి రాంబాబు, శ్రీనివాస కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఇన్‌చార్జి గంగా సురేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని స్వచ్ఛంద స్వర్ణాంధ్ర శనివారం బోల్లపాడులో జరిగింది. ఎంపీటీసీ గంగరత్నం, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శి రాణి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్ఎం కోసా బేగం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి చేటు

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఈలప్రోలు వాసు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. షాపుల యజమానులకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించారు. సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం హరిశరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు మధుసూధనరావు, శ్రీనివాసరావు, నాయక్, పీడీ శాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ నినాదంతో కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందికి స్టెయిన్లెస్ స్టీల్ బాటిల్స్ పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని సూచించారు. ఎంపీడీఓ పి.అనూష, మండల పరిషత్ ఏఓ బసవయ్య పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగించకుండా, వాటికి బదులుగా క్లాత్ లేదా జూట్ సంచులు వాడాలని బాపులపాడు ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణేశ్వరి సూచించారు.

రూరల్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

విజయవాడ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రను నిర్వహించారు. నున్న గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్, సచివాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అలాగే పాతపాడు, పి.నైనవరం, అంబాపురం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రను నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ కల్యాణ వేదికలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, నేత్రాలు, దంత వైద్య పరీక్షలు జరిపారు. సదరు రోగులు తీసుకోవాల్సిన ఆరోగ్య, ఆహార జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. పట్టణ ప్రజలు ఆరోగ్య సంరక్షణ కోసం విరివిగా ఉచి త వైద్య క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి సీతారాంబాబు, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కొండా

కంకిపాడు: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా కంకిపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండా నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు అందాయి. శనివారం ఆ ఉత్తర్వులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతులమీదుగా కొండా నాగేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. టీడీపీ నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడిగడప వక్ఫ్ భూముల వద్ద ఉద్రిక్తత



తాడిగడప వక్ఫ్ భూముల వద్ద అధికారులు

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాల పరిధిలో ఉన్న వక్ఫ్ భూముల వద్ద శనివారం ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వక్ఫ్ భూములకు ఇటీవల తహసీల్దార్ గోపాలకృష్ణ హైకోర్టు ఆదేశాల మేరకు కౌలు వేలంపాట నిర్వహించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వేలంపాట వివరాలు హైకోర్టుకు సమర్పించారు. కోర్టు తుది ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. అయితే పెదపులిపాక ఆర్ఎస్ నెంబర్ 87లో 12.59 ఎకరాలు, అలాగే తాడిగడపలో ఆర్ఎస్ నెంబర్ 178లోని 13 ఎకరాల భూమిని గతంలో సాగు చేసిన కొందరు వ్యక్తులు ప్రవేశించి దమ్ము చేసి, వరినాట్లు వేయసాగారు. ఈ సమాచారం తెలుసుకున్న వక్ఫ్ బోర్డు సీఈవో మొహమ్మద్ అలీ, ఇన్‌స్పెక్టర్ నూఆలీషా, కొండపల్లి ఖాజీ హబీబుల్లా హుసేనీ, సిబ్బంది కరీముల్లా అక్కడకు చేరుకున్నారు. కోర్టు పరిధిలో ఉన్న పొలంలో ఎలా నాట్లు వేస్తారని ప్రశ్నించారు. పొలంలో ఉన్న కూలీలను బయటకు పంపించారు.

రెచ్చిపోయిన పచ్చ నేతలు

కౌలు వ్యవహారంపై హైకోర్టు మరి కొద్దిరోజుల్లో తుది తీర్పు ఇవ్వనుందని, అప్పటి వరకు ఎవరైన వక్ఫ్ భూముల్లో చట్ట విరుద్ధంగా దిగి సాగు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వక్ఫ్ అధికారులు హెచ్చరించారు. అయితే సాగుకు దిగిన వారు తాము చాలాకాలంగా సాగు చేస్తున్నామని, కోర్టు ఆదేశాలు ఇవ్వనందున సాగు చేసే హక్కు తమకే ఉందని అనడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అదే సమయంలో అక్కడే ఉన్న పచ్చ నేతలు మతపరంగా వివాదస్పదమైన ఆరోపణలు వక్ఫ్ అధికారులపై చేశారు. దీంతో అధికారులు పచ్చనేతల మాటలను తీవ్రంగా ఖండించారు. రాత్రి వరకు వివాదం కొనసాగుతూనే ఉంది. కాగా వక్ఫ్ భూముల హైకోర్టుపై తుది తీర్పు వెలువడితేనే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉంది.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పేర్కొన్నారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నున్న సీఐ పి.కృష్ణమోహన్ మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డుకారాదనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకొని పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్ కాలేజీలో శనివారం విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమతో అనుసంధానం అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వల్లూరు లావణ్య(టీఏఓ డిజిటల్ సొల్యూషన్స్) మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ఆ దిశగా పట్టుదలతో చదివినట్టయితే ప్రతిభావంతులు కాగాలరని అన్నారు. పలు సంస్థల హెచ్ఆర్‌లు భానుప్రకాష్, డాక్టర్ అబ్దుల్ రహీద్, ఎం.శివప్రసాద్, గణేష్ సోమిశెట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.కీర్తిరెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.